E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 18-04-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:106 || పేజీలు–6
www.ekaburu.com

## భారత్, పాక్ పోటాపోటీగా.. ఆయుధ పరీక్షలు



03



03

ఒక ఎంపీ లక్షల మంది సమస్యలను
### ఎలా వినగలరు? ; అమిత్ షా

ఈ-కబురు,: లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై కొనసాగిన సుదీర్ఘ చర్చ ముగిసింది. వీటిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. "మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు.



03

దేశ రాజకీయ చిత్రపటాన్ని
### మార్చే ప్రయత్నం ; రాహుల్ గాంధీ

ఈ-కబురు, : ఇప్పటికే (2023లోనే) మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్,



03

### అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు

... పాక్‌కు భారత్ హెచ్చరిక

ఈ-కబురు,: భారత అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లుపై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది.

# వీగిపోయిన బిల్లు



- లోక్‌సభలో 131 వ సవరణ బిల్లు తిరస్కరణ
- ఓటింగ్‌లో పాల్గొన్న మొత్తం ఎంపీలు 528 మంది
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ఉపసంహరించుకున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటన
- 'ఓబీసీలను వ్యతిరేకించే పార్టీల్లో కాంగ్రెస్ ముందుంటుంది ; కేంద్ర మంత్రి అమిత్‌షా

**ఈ-కబురు, ఢిల్లీ ;**

కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చి ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయింది. శుక్రవారం లోక్‌సభ వేదికగా జరిగిన ఓటింగ్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేయడానికి, అలాగే కొత్త జనాభా గణన నిర్వహించకుండా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి వీలు కల్పించే డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభ తిరస్కరించింది. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రవేశపెట్టిన రాజ్యాంగ(131వ సవరణ) బిల్లు వీగిపోవడంతో మిగతా రెండు బిల్లులకు ఓటింగ్ అవసరం లేకుండా పోయింది. ఈ ఓటింగ్‌లో మొత్తం 528 మంది ఎంపీలు పాల్గొనగా, అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. బిల్లు ఆమోదానికి కావాల్సిన ఓట్ల సంఖ్య 352. దాంతో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. దాంతో మిగతా రెండు బిల్లులు డీలిమిటేషన్, మహిళ రిజర్వేషన్ బిల్లులను ఉపసంహరించుకున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. బిల్లులు ప్రవేశపెట్టేముందు కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. 'ఓబీసీలను వ్యతిరేకించే పార్టీల్లో కాంగ్రెస్ ముందుంటుంది. చరణ్ సింగ్, కేసరిలాంటి ఓబీసీలకు అన్యాయం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది. ఓబీసీల కోసం కాకాసింగ్ కాలేకర్ చేసిన సూచనలను కాంగ్రెస్ తుంగలో తొక్కింది. మండల్ కమిషన్ ఇచ్చిన నివేదికను సైతం కాంగ్రెస్ ఆమోదించలేదు. వీపీ సింగ్ వచ్చిన తర్వాత మండల్ కమిషన్ రిపోర్టుకు మోక్షం దక్కింది. రాజీవ్ గాంధీ తన జీవితాంతం మండల్ కమిషన్ నివేదికను వ్యతిరేకిస్తూ వచ్చారు. 15-20 సార్లు ఎన్నికల్లో ఓడిపోయాక కాంగ్రెస్‌కు ఓబీసీలు గుర్తుకొచ్చారు. బీజేపీ మాత్రమే అత్యంత వెనకబడిన ఓబీసీ నాయకుడు మోదీని ప్రధానిని చేసింది. మోదీ ప్రభుత్వంలో 27మంది కేంద్ర మంత్రులు ఓబీసీలే. మొత్తం క్యాబినెట్‌లో ఓబీసీల శాతం 40. 1992,72,73 సవరణల ద్వారా వీపీ నరసింహారావు పంచాయతీల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. పీవీ నరసింహారావును ఎప్పుడూ కాంగ్రెస్ తన సొంత మనిషిగా భావించలేదు. 1996లో దేవేగౌడ 81వ సవరణ ద్వారా మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం చేశారు. మహిళా బిల్లును బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదు. మన్మోహన్ ప్రభుత్వానికి మద్దతిచ్చిన పార్టీలే మహిళా బిల్లును వ్యతిరేకించాయి. కాంగ్రెస్ కుట్రతోనే తన అనుకూల పార్టీలతో మహిళా బిల్లును వ్యతిరేకించింది.ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లును.. అడ్డుకుంటున్న వారికి ప్రజాక్షేత్రంలో మహిళలు బుద్ధి చెబుతారు' అని హెచ్చరించారు.

మిగతా 2లో

### ఇది జాతీయ విపత్తును నివారించిన రోజు: రేవంత్‌రెడ్డి



02

ఈకబురు, హైదరాబాద్:

ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన

30 లక్షల మెట్రిక్ టన్నుల
### బాయిల్డ్ రైస్ సేకరించండి



- 5 శాతం నూకతో బాయిల్డ్ రైస్ సరఫరాకు సిద్ధం
- పాత బకాయిలు రూ.1,468.96 కోట్లు విడుదల చేయండి
- పోషకాహార బియ్యం పంపిణీని పునఃప్రారంభించండి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వినతి

మిగతా 2లో

## అన్ని వర్గాలకు అధికారం రావాలన్నదే మా ధ్యేయం

- సామాజిక, సర్వోదయ తెలంగాణ కోసం పోరాటం చేస్తా
- అందరికీ అధికారం అనగానే నాకు కష్టాలు మొదలయ్యాయి
- ప్రతి కష్టాన్ని పాఠంగా నేర్చుకుంటూ కసిగా లక్ష్యం వైపు పయనిస్తున్నా
- సామాజిక న్యాయం కోసం కుల సంఘాలు ఏర్పాటు చేసింది మారోజు వీరన్నే
- ఆయన అనుచరులు మాకు మద్దతు తెలపటం ఆనందంగా ఉంది
- కలసి పనిచేద్దాం.. ఇక మనల్ని ఆపే శక్తే లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు



**ఈ-కబురు,,హైదరాబాద్**

తెలంగాణలో అన్ని వర్గాలకు అధికారం దక్కాలన్నదే తన ధ్యేయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ సాధించుకొని 12 ఏళ్లు గడిచినప్పటికీ ఇప్పటికీ కనీసం గ్రామ వార్డు పదవి కూడా పొందని కులాలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాగృతి ఈ నెల 25 న ఏర్పాటు చేయబోతున్న పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ప్రకటించింది. జాగృతి కార్యాలయంలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న,

మిగతా 2లో



### ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబు బెదిరింపు

02

## హర్మూజ్‌పై ఇరాన్ కీలక ప్రకటన

.. నౌకల రాకపోకలకు లైన్‌క్లియర్




ఈకబురు,: పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు.

మిగతా 3లో

ఢిల్లీలో రేవంత్ రెడ్డి తో
## టీడీపీ మహిళా నేతల భేటీ

.... రాజకీయ వర్గాల్లో ఆసక్తి

- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో టీడీపీ మహిళా ఎమ్మెల్యేల భేటీ
- ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసిన పరిటాల సునీత, ఇతర నేతలు
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల సందర్భంగా ఈ సమావేశం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన భేటీ ఫోటోలు
- భిన్న రాజకీయ కూటముల నేతల కలయికపై చర్చ



మిగతా 2లో



## స్వచ్ఛాంధ్ర సాకారానికి పటిష్ట కార్యాచరణ

- 100 శాతం చెత్త సేకరణ, ప్రాసెసింగ్ జరగాలి
- మున్సిపాలిటీల్లో కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం
- పార్కులుగా గ్రామీణ, పట్టణ సరిహద్దు డంపింగ్ యార్డులు
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- స్వచ్ఛాంధ్ర ర్యాంకుల్లో విశాఖ జిల్లాకు మొదటి స్థానం... చివరన నిలిచి ఏఎస్ఆర్ జిల్లా

మిగతా 2లో

# వీగిపోయిన బిల్లు



---బిల్లులివే..
-రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు2026: మహిళా రిజర్వే షన్లను 2029 నుంచే అమలు చేయడానికి వీలుగా గతంలోని జనగణనను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం.
-కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2026: అసెంబ్లీల్లో 33శాతం మహిళల కోటా అమలుకు వీలుగా కేంద్ర పాలిత ప్రాంతాలో నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టడం.
-డీలిమిటేషన్ బిల్లు2026: దేశవ్యాప్తంగా లోక్‌సభలో, అసెంబ్లీల్లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి వీలుగా డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయడం.

# ఇది జాతీయ విపత్తును నివారించిన రోజు: రేవంత్‌రెడ్డి



ఈకబురు, హైదరాబాద్:
ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి స్పందించారు. ''రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలు'' అని రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# ఢిల్లీలో రేవంత్ రెడ్డి తో టీడీపీ మహిళా నేతల భేటీ



ఈకబురు,, న్యూ ఢిల్లీ :
దేశ రాజధాని ఢిల్లీలో ఒక ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యే పరిటాల సునీత సహా పలువురు మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను పరిటాల సునీత తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేయడంతో అవి వైరల్ అయ్యాయి. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల కోసం వివిధ పార్టీల నేతలు ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ప్రాంగణంలో రేవంత్ రెడ్డి, టీడీపీ మహిళా ఎమ్మెల్యేల మధ్య ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ప్రస్తుతం టీడీపీ కేంద్రంలో ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉండగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇలా భిన్న రాజకీయ ధ్రువాలకు చెందిన నేతలు కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యేగా కొనసాగిన నేపథ్యంలో పాత పరిచయాల కారణంగానే మర్యాదపూర్వక భేటీ అని భావిస్తున్నారు.

# ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబు బెదిరింపు



ఈకబురు,, హైదరాబాద్:
ఉప్పల్ మెట్రోస్టేషన్‌లో బాంబు ఉన్నట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరించాడు. మెట్రో స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అయితే, అనుమానాస్పద వస్తువులేవీ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తనిఖీల్లో ఎలాంటి బాంబు గుర్తించలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన వ్యక్తి గురించి ఆరా తీస్తున్నారు.

# స్వచ్ఛాంధ్ర సాకారానికి పటిష్ట కార్యాచరణ



ఈకబురు,,అమరావతి, ఏప్రిల్ 17:
స్వచ్ఛాంధ్ర సాకారం కావడానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. లక్ష్యాలు చేరుకోవడంలో విఫలమైతే... కారణాలు అన్వేషించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో 'స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర' పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఈ ఏడాది మార్చి 31 వరకు రూపొందించిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర ర్యాంకులను అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు జిల్లాలు స్వచ్ఛాంధ్రలో మొదటి మూడు స్థానాల్లో ఉండగా... శ్రీ సత్యసాయి, పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలు చివరి మూడు స్థానాల్లో ఉన్నట్టు తెలిపారు. ఇందులో విశాఖ జిల్లాకు 92 శాతం, విజయనగరం, గుంటూరు జిల్లాలకు 85 శాతం మార్కులు వచ్చాయి. అట్టడుగున ఉన్న ఏఎస్ఆర్ జిల్లాకు కేవలం 53 శాతం మార్కులు మాత్రమే వచ్చాయి. డోర్ టు డోర్ కలెక్షన్, తడి చెత్తపొడి చెత్త వేరు చేయడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ వంటివి ర్యాంకులకు ప్రాతిపదికగా తీసుకున్నట్టు చెప్పారు.. అయితే ఇకపై జిల్లాలకు స్వచ్ఛాంధ్ర ర్యాంకులు థర్డ్ పార్టీ ఇచ్చేలా చూడాలని సీఎం సూచించారు.

-జూన్ కల్లా 100 శాతం చెత్త క్లియర్

మున్సిపాలిటీల్లో అవసరమైన చోట కొత్తగా పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. అలాగే నిర్ణీత పరిధిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు నెలకొల్పేలా చూడాలన్నారు. గతంలో వ్యర్థాలతో నిండిపోయిన డంపింగ్ యార్డుల్లో... ప్రస్తుతం చెత్త క్లియర్ చేయడంతో పాటు ఆయా స్థలాలను పచ్చదనంతో నింపేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణానికి సమీపంలో ఉన్న డంపింగ్ కేంద్రాలను ముందుగా పార్కులుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. 2024 జూన్ నుంచి నేటి వరకు పట్టణాల్లో 153 లక్షల టన్నుల చెత్తకు గాను, 114 లక్షల టన్నుల చెత్త తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ జూన్ కల్లా 100 శాతం క్లియర్ చేయాలని సీఎం ఆదేశించారు. గ్రామాల్లో పేరుకు పోయిన 10 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఇంటింటికీ చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ కూడా 100 శాతం జరగాలన్నారు. కంపోస్ట్ మార్కెటింగ్ చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు సమన్వయ బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. మ్యాజిక్ డ్రెయిన్లకు అనుసంధానంగా కమ్యూనిటీ సోక్ పిట్స్ తీసుకురావడం ద్వారా మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు, భూగర్భ జలాలు పెరిగేందుకు దోహద పడుతుందని సీఎం అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, నెట్ జీరో, గ్రీనరీ పెంపు, క్లీన్‌హైజీన్ కిచెన్ వంటి అంశాలపై ముఖ్యమంత్రి పలు మార్గదర్శకాలు జారీ చేశారు. గాలి నాణ్యత పర్యవేక్షణకు ప్రస్తుతమున్న 83 ప్రాంతాలతో పాటు, అదనంగా 53 మాన్యువల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు.

డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు, ఈ వేస్ట్ కలెక్షన్‌కు సంబంధించి అమలు చేస్తున్న విధానాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 633 స్వచ్ఛ రథాలతో రోజుకు 125 టన్నుల పొడి చెత్త సేకరిస్తున్నామని, గోబర్ ధన్ యూనిట్లు, గ్రీన్ షాప్స్ ద్వారా చెత్తను ఆదాయంగా మారుస్తున్నామని అధికారులు తెలిపారు. మురుగు నీటి నిర్వహణలో కూడా సమూల మార్పులు తెస్తున్నామని... గ్రే వాటర్, బ్లాక్ వాటర్ నిర్వహణకు భారీ ప్రాజెక్టులు చేపట్టినట్టు వివరించారు. పొడి చెత్తను సేకరించే గ్రీన్ షాపులకు స్వచ్ఛ రథం ఏజెన్సీ నుంచి, పంచాయతీ నుంచి సాయం అందించేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ కల్లా గోబర్ ధన్ ప్లాంట్లు సిద్ధం అవుతాయని వెల్లడించారు. అలాగే 'స్వచ్ఛ పథం' పేరుతో గ్రామీణ రోడ్ల శుభ్రత కోసం ప్రత్యేక వాహనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు

10 జిల్లాల్లో 590 ఎకరాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులు అభివృద్ధి చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు. పట్టణాల్లో 20242026 మధ్య గ్రీన్ స్పేస్ పార్కులు 57 అభివృద్ధి చేసినట్టు వివరించారు. మరో 284 గ్రీన్ స్పేస్ పార్కులు, 100 స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని అధికారులు తెలపగా, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు. గ్రామాల్లో మురుగునీటి నిర్వహణకు సోక్ పిట్స్, కిచెన్ గార్డెన్స్, మ్యాజిక్ డ్రెయిన్స్ వంటి విధానాలు అవలంభిస్తున్నామని, ఈ ఏడాది డిసెంబర్ కల్లా... 7.14 లక్షల కిచెన్ గార్డెన్స్, 1 లక్ష సోక్ పిట్స్, 8,000 కమ్యూనిటీ సోక్ పిట్స్, 100 కి.మీ. మ్యాజిక్ డ్రైన్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా అన్ని గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా నిలపాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 31.33 శాతంగా ఉన్న గ్రీన్ కవర్‌ను... 2030 నాటికి 37 శాతానికి, 2047 కల్లా 50 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమీక్షలో మంత్రి నారాయణ, పీసీబీ చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఎంఏయూడీ కమిషనర్ సంపత్ కుమార్, పంచాయతీరాజ్ శాక డైరెక్టర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలకు అధికారం రావాలన్నదే మా ధ్యేయం



మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు కవితను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నప్పటికీ సామాజిక తెలంగాణ మాత్రం తెచ్చుకోలేకపోయామన్నారు. ఉద్యమ సమయంలోనే ఈ అంశాన్ని ప్రొఫెసర్ జయశంకర్ సార్ దగ్గర ప్రస్తావించిన విషయాన్ని కవిత గుర్తు చేసుకున్నారు. భారత్ కు స్వాతంత్రం వచ్చిన సమయంలోనూ గాంధీ, అంబేడ్కర్ ముందు కూడా ఇదే సమస్య వచ్చిందని...భారత కుల వ్యవస్థలో ఈ అంశం నిరంతరం మన ముందుంటుందని జయశంకర్ సార్ అన్నారని చెప్పారు. ముందు మనం భౌగోళిక తెలంగాణ సాధించుకొని ఆ తర్వాత సామాజిక తెలంగాణ కోసం పోరాటం చేయాలని సూచించారన్నారు. కానీ దురదృష్టవశాత్తు తెలంగాణ వచ్చి 12 ఏళ్లు గడుస్తున్న ఇప్పటికీ ఎన్నో కులాలు అధికారానికి దూరంగా ఉన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు అధికారం కోసం జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని ఆమె చెప్పారు.

**అందరికీ అధికారం అనగానే కష్టాలు**

బీఆర్ఎస్ లో తాను ఎప్పుడైతే అన్ని వర్గాలకు అధికారం రావాలని కోరానో అప్పటి నుంచే తనకు కష్టాలు మొదలయ్యాయని కవిత చెప్పారు. కానీ ఆ కష్టాలు తన లక్ష్యం కోసం పనిచేసేందుకు తనలో కసి పెంచాయని చెప్పారు. ప్రతి కష్టాన్ని పాఠంగా నేర్చుకుంటూ సామాజిక తెలంగాణ కోసం ముందుకు కదులుతానని అన్నారు. ఈ నెల 25న తాము నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని చెప్పారు. తెలంగాణ తత్వం, సామాజిక కోణం రంగరించి తమ పార్టీ ముందుకు వెళ్తుందని కవిత స్పష్టం చేశారు.

**–కుల సంఘాల కర్త, కర్మ, క్రియ...మారోజు వీరన్న**

కులాలు బలంగా ఉన్నప్పుడే వారికి రాజకీయ అధికారం దక్కుతుందని బలంగా నమ్మిన వ్యక్తి మారోజు వీరన్న అని కవిత చెప్పారు. రాష్ట్రంలో కుల సంఘాలకు కర్త, కర్మ, క్రియ ఆయనేనని గుర్తు చేశారు. కులాల అస్తిత్వాన్ని, విప్లవ ఉద్యమాలకు జత చేసి సామాజిక న్యాయం కోసం వీరన్న కృషి చేశారని కవిత చెప్పారు. ఆయన మన ముందు పెట్టిన బాధ్యతను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. తాము పార్టీ పెట్టబోయే ముందు మీరిచ్చిన ధైర్యం మామూలుది కాదన్నారు. మారోజు వీరన్న అనుచరులంటే ఎంతో నైతికత ఉన్న వారని చెప్పారు. వీరన్న అనుచరుల మద్దతుతో రాష్ట్రంలో ఇక మనల్ని ఆపే శక్తే లేదని కవిత ధీమా వ్యక్తం చేశారు. అందరం కలిసి సమన్వయంతో పనిచేసుకుందామని పిలుపునిచ్చారు. మీరిచ్చిన ధైర్యంతో సర్వోదయ తెలంగాణ కోసం ముందుకు కదులుతానని అన్నారు.

**–మాజీ మావోయిస్టుల కోసం పోరాడుతాం**

తెలంగాణ ఉద్యమంలో మాజీ మావోయిస్టులు లక్షమంది వరకు పాల్గొన్నారని కవిత గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో వారంతా బీఆర్ఎస్ లో చేరి ఆ పార్టీ బలంగా మారేందుకు చోదక శక్తి అయ్యారన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారెవరికీ కూడా మేలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులు, తెలంగాణ అమరవీరుల కోసం ఏ విధంగా భూపోరాటం చేస్తున్నామో...మాజీ మావోయిస్టుల కోసం కూడా అదే విధంగా పోరాడుతామని కవిత హామీ ఇచ్చారు.

**–ప్రభుత్వ ఉద్యోగులకు ఘోర మోసం**

ప్రభుత్వ ఉద్యోగులను కాంగ్రెస్ దారుణంగా వంచిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పీఆర్సీ అమలు చేస్తామని నమ్మబలికి...ఇప్పుడు ఆ ఊసే ఎత్తటం లేదని మండిపడ్డారు. ఎన్నికల హామీలైన సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ స్కీం పునరుద్ధరణను గాలికి వదిలేసి కాంగ్రెస్ తన నైజాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. ఉద్యోగుల హెల్త్ స్కీం కేవలం కాగితాలకే పరిమితం చేశారని...రిటైర్మెంట్ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇది ఉద్యోగ లోకాన్ని ఘోరంగా మోసం చేయటమేనని కవిత అన్నారు. కనీసం వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వటం లేదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలను పెండింగ్ లో పెట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఇవ్వాళ మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు చేపట్టిన నిరసనకు జాగృతి తరపున మద్దతు ప్రకటించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

# 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించండి





ఈకబురు,, ఢిల్లీ:
యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో సీఎం, రాష్ట్ర మంత్రి శుక్రవారం కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. తెలంగాణలో పండే యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో యాసంగి పంటకు సంబంధించిమొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి చేసిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. 2014-15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి తెలియజేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గానూ పోషకాహార బియ్యాన్ని (FRK) పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్‌ల పరిధిలో పంపిణీ చేసేవారని... ఇటీవల దానిని నిలిపివేసినందున వెంటనే దానిని పునః ప్రారంభించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ సింగ్, కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# భారత్, పాక్ పోటాపోటీగా.. ఆయుధ పరీక్షలు



**.. నోటమ్‌లు జారీ**

ఈకబురు, : క్షిపణుల ప్రయోగాలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్‌పాకిస్థాన్‌లు ఒకేసారి నోటమ్‌లు జారీ చేశాయి. ఈ క్రమంలో అరేబియా సముద్రంలో పోటాపోటీగా ఇరుదేశాలు క్షిపణుల విన్యాసాలు జరపనున్నట్టు తెలుస్తోంది. ఏప్రిల్ 20, తెల్లవారుజామున 3:00 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3:00 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22న ఉదయం 9:30 నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9:30 గంటల వరకు సుదీర్ఘ కాలానికి ఈ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని 'నోటీసెస్ టు ఎయిర్‌మెన్', 'మారిటైమ్ అడ్వైజరీస్' లాంటి హెచ్చరికలు జారీ చేయడం దేశాల మధ్య సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. అయితే ఇరుదేశాలు ఒకేసారి ఈ నోటమ్‌లు ప్రకటించడం విశేషం. పాక్ 200 కిలోమీటర్ల మేర ఈ జోన్‌ను ప్రకటించగా, దానికి రెట్టింపుగా భారత్ 400 కిలోమీటర్ల క్షిపణుల విన్యాసం కోసం జోన్‌ను ప్రకటించింది. అయితే సరిహద్దు దేశాలు తరచూ ఇలాంటి క్షిపణుల ప్రయోగాలు నిర్వహిస్తూనే ఉంటాయి. ఆపరేషన్ సిందూర్(Sindoor) జరిగిన ఏడాది తర్వాత ఈ ఆయుధ పరీక్షలపై ప్రకటనలు వెలువడడం గమనార్హం.

# అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు
## ... పాక్‌కు భారత్ హెచ్చరిక



ఈకబురు,: భారత అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లుపై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. దేశానికి సంబంధించిన అంతర్గత విషయాల్లో చొరబడేందుకు చేసే యత్నాలను భారత్ ఎన్నటికీ సహించబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. దేశంలోని పరిపాలనా, శాసనపరమైన ప్రక్రియలకు సంబంధించిన నిర్ణయాలు సార్వభౌమత్వానికి సంబంధించిన విషయాలని.. వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించబోమన్నారు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి అధికారం కల్పించే ఒక నిబంధన డీలిమిటేషన్ బిల్లు 2026లో ఉంది. ఈ నిబంధనపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్ ప్రవేశ పెట్టిన ఈ డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ పేర్కొన్నారు.

# బాలికపై లైంగిక వేధింపులు..
## నిందితుడిని పోలీసులకు అప్పగించిన వారికి సన్మానం



ఈకబురు,,హైదరాబాద్: తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న నిందితుడిని అడ్డుకొని, పోలీసులకు అప్పగించిన సెజల్, గణపతి, కాశీనాథ్‌లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం వారిని సన్మానించారు. ప్రశంసా పత్రాలతోపాటు నగదు రివార్డు అందజేశారు. ఈ నెల 14న సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10 సమీపంలో ఒక వ్యక్తి చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని గమనించారు. ఆ చిన్నారి కళ్లలో భయాన్ని చూసి చలించిపోయిన వారు, తక్షణమే స్పందించి అటుగా వెళ్తున్న కాశీనాథ్, శ్రీనారాయణల సాయంతో నిందితుడిని అడ్డుకున్నారు. బాలికను సురక్షితంగా రక్షించడమే కాకుండా, డయల్ 100కు సమాచారం అందించి నిందితుడిని పోలీసులకు పట్టించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్ గూడకు చెందిన జావీద్ అనే వ్యక్తిగా తేలింది. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో, ఆ చిన్నారికి ఐస్‌క్రీమ్ కొనిస్తానని మభ్యపెట్టి తన బైక్‌పై తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేసినట్లు నిర్ధరణ అయ్యింది. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. సమయస్ఫూర్తితో, సామాజిక బాధ్యతతో వ్యవహరించిన ఈ ముగ్గురినీ కొనియాడారు. వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని, మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. నేరాల నియంత్రణలో పోలీసులు ఎంత కృషి చేసినా, పౌర చైతన్యం తోడైనప్పుడే వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రజాపోలీస్‌గా మారాలని పిలుపునిచ్చారు. ఇటీవల గోల్కొండ ప్రాంతంలో ఫిరోజ్ అనే వ్యక్తి ఇలాగే ఎనిమిదేళ్ల బాలికను రక్షించిన ఘటనను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు జరిగినప్పుడు భయపడకుండా వెంటనే డయల్ 100కి ఫోన్ చేసిగానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నెంబర్ 94906 16555కి సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.

# హర్మూజ్‌పై ఇరాన్ కీలక ప్రకటన .. నౌకల రాకపోకలకు లైన్‌క్లియర్




కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికాఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్‌ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగనున్నాయని తెలిపారు. ఇరాన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

**——పడిపోయిన ముడిచమురు ధరలు**

ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది. ఇరాన్ ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్ దూసుకెళ్తోంది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ సూచీ 1 శాతం పెరగ్గా.. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.7 శాతం పుంజుకొంది. నాస్‌డాక్ కాంపోజిట్ ఒక శాతం మేర లాభపడింది. భారత్ స్టాక్ మార్కెట్‌ను ప్రతిఫలించే గిఫ్ట్ నిఫ్టీ (ఫ్యూచర్స్) సైతం దాదాపు 300 పాయింట్లు మేర లాభంతో 24,700 పాయింట్ల ఎగువన ట్రేడవుతోంది.

# ఒక ఎంపీ లక్షల మంది సమస్యలను ఎలా వినగలరు?;అమిత్ షా



ఈకబురు, : లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై కొనసాగిన సుదీర్ఘ చర్చ ముగిసింది. వీటిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. "మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరు? నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించాం" అని అమిత్ షా పేర్కొన్నారు.

--మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల ఓటర్లు..

"మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. దిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే" అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు.

--ఉత్తరాది.. దక్షిణాది కాదు..

"ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ భేదాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

--అలా చేస్తే మద్దతిస్తారా..?

మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు.

# దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం ; రాహుల్ గాంధీ



ఈకబురు, : ఇప్పటికే (2023లోనే) మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు."మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోంది. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోంది? విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయి" అని రాహుల్ గాంధీ అన్నారు. "న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదు" అని రాహుల్ ధ్వజమెత్తారు.

---రాహుల్ క్షమాపణలు చెప్పాలి..

లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానించడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు.

# కేపీహెచ్‌బీలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

**ఈ-కబురు,, హైదరాబాద్:హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పరిధిలో ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. అప్రమత్తమైన బస్సు సిబ్బంది వెంటనే ప్రయాణికులను కిందికి దించివేశారు. బస్సు మియాపూర్ నుంచి ఎస్ఆర్ నగర్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.**



స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీదుర్గా మహేశ్వరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు శుక్రవారం రాత్రి మియాపూర్ నుంచి పాలకొల్లు వెళ్లేందుకు బయల్దేరింది. ఈ క్రమంలో కేపీహెచ్‌బీ సమీపంలోని పద్మావతి ప్లాజా బస్‌స్టాప్ వద్ద ఆగి ఉంది. రాత్రి 10.45 గంటల సమయంలో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో తొలుత మంటలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. అందులో ఉన్న 18 మంది ప్రయాణికులను కిందికి దించివేశారు. అనంతరం మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. ఘటనాస్థలికి ట్రాఫిక్ సీఐ జానయ్య, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది.



## పసిడి దిగుమతులు జిగేల్

అంతర్జాతీయంగా ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ, దేశంలో బంగారం దిగుమతులు సరికొత్త రికార్డులు సృష్టించాయి. వాణిజ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 202526 ఆర్థిక సంవత్సరంలో పసిడి దిగుమతులు 24 శాతం మేరకు పెరిగి జీవన కాల గరిష్ఠ స్థాయి అయిన రూ.6,65,815 కోట్లకు (71.98 బి.డాలర్లు) చేరుకున్నాయి. పసిడి ధరలు విపరీతంగా పెరగడమే ఈ స్థాయిలో దిగుమతుల విలువకు ప్రధాన కారణం.

**4.76 శాతం క్షీణతతో**

విలువ పరంగా పసిడి దిగుమతులు పెరిగినప్పటికీ, పరిమాణ పరంగా చూస్తే దిగుమతులు క్షీణించడం గమనార్హం. 202425లో 759.09 టన్నులుగా ఉన్న బంగారం దిగుమతులు 202526 నాటికి 4.76 శాతం క్షీణించి 721.03 టన్నులకు పడిపోయాయి. కానీ, బంగారం ధర కిలోకు సుమారు రూ.70.87 లక్షల నుంచి ఏకంగా రూ.92.33 లక్షలకు పెరగడం వల్లే దిగుమతుల విలువ భారీగా పెరిగిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరాల్లో పసిడి దిగుమతుల విలువను పరిశీలిస్తే.. 202425లో రూ.5.36 లక్షల కోట్లు, 2023 24లో రూ.4.21 లక్షల కోట్లు, 202223లో రూ.3.23 లక్షల కోట్లుగా నమోదైంది. దేశ మొత్తం దిగుమతులలో పసిడి వాటా ఏకంగా 5 శాతానికి పైగా ఉండటం విశేషం.

**వెండి దిగుమతులూ..**

పసిడితోపాటే వెండి దిగుమతులూ భారీగా పెరిగాయి. అధిక ధరల కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో వెండి దిగుమతులు 150% పెరిగి, రూ.1.11 లక్షల కోట్లకు చేరాయి. పరిమాణం పరంగా చూస్తే, ఇది 42 శాతం పెరిగి 7,334.96 టన్నులుగా నమోదైంది. ఈ విలువైన లోహాల దిగుమతులు పెరగడంతో 202526లో దేశ వాణిజ్య లోటు ఏకంగా రూ.30.82 లక్షల కోట్లకు (333.2 బి.డాలర్లు) పెరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి.

**స్విట్జర్లాండ్ నుంచే అత్యధికం..**

చైనా తర్వాత ప్రపంచంలో రెండో అతిపెద్ద బంగారం వినియోగదారుగా భారత్ నిలుస్తోంది. దేశీయ ఆభరణాల పరిశ్రమ గిరాకీని తీర్చేందుకు దిగుమతులు అవసరం అవుతున్నాయి. మన దేశానికి దిగుమతి అవుతున్న బంగారంలో అత్యధికంగా 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే వస్తోంది. ఆ తర్వాతి స్థానాల్లో యూఏఈ, దక్షిణాఫ్రికా ఉన్నాయి. 2025 26లో స్విట్జర్లాండ్ నుంచి జరిగిన మొత్తం దిగుమతులు 11.36 శాతం పెరిగి రూ.2.24 లక్షల కోట్ల (24.27 బి.డాలర్లు)కు చేరుకున్నాయి.

## అతిపెద్ద ఐపీఓ దిశగా స్పేస్ఎక్స్




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ స్పేస్ఎక్స్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ నిమిత్తం కాన్ఫిడెన్షియల్ పత్రాలను దాఖలు చేసింది. మొత్తం 2 లక్షల కోట్ల డాలర్ల విలువ లక్ష్యంతో ఐపీఓకు ఈ కంపెనీ వెళుతోంది. అయితే ఇందులో చాలా తక్కువ భాగాన్నే విక్రయించడం ద్వారా, ప్రజల నుంచి 75 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.6.9 లక్షల కోట్లు) నిధులను సమీకరించాలని భావిస్తోంది. ఇది కంపెనీ మొత్తం విలువలో 3.75 శాతం మాత్రమే. అయినప్పటికీ చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓగా అది నిలవనుంది.

10% నిబంధన పక్కకు: నిబంధనల ప్రకారం, మొత్తం విలువలో అతి తక్కువ శాతాన్ని లిస్ట్ చేసే కంపెనీలు ప్రధాన మార్కెట్ సూచీలైన ఎస్ అండ్ పీ 500 లేదా నాస్‌డాక్ 100లోకి చేరే అర్హతను కలిగి ఉండవు. కనీసం కంపెనీ విలువలో 10 శాతం వాటాను విక్రయించాల్సి ఉంటుంది. అయితే భారీ స్థాయి లిస్టింగ్ విలువ కారణంగా స్పేస్ఎక్స్ కోసం ఈ నిబంధనను సడలించనున్నారు.

# ఉద్రిక్తతల తగ్గుముఖంపై ఆశలతో..

**పశ్చిమాసియా ప్రాంతంతో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టొచ్చన్న అంచనాల నేపథ్యంలో సూచీలు లాభాల్లో ముగిశాయి. ముడి చమురు ధరలు దిగిరావడం, విదేశీ సంస్థాగత మదుపర్లు తిరిగి కొనుగోళ్ల బాట పట్టడం కూడా మార్కెట్ సెంటిమెంట్ బలపడటానికి దోహదం చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 23 పైసలు పెరిగి 92.91 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 10.52 శాతం తగ్గి 88.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ నష్టాల్లో ముగియగా.. ఐరోపా మార్కెట్లు లాభాల్లో ఆరంభమయ్యాయి.**

**మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.84 లక్షల కోట్లు పెరిగి రూ.465.64 లక్షల కోట్లకు (5.02 లక్షల కోట్ల డాలర్లు) చేరింది.**




స్వల్ప నష్టాల్లో మొదలై..: ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,976.13 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో (క్రితం ముగింపు 77,988.68) ప్రారంభమైంది. ఆ వెంటనే లాభాల్లోకి వచ్చిన సూచీలు క్రమక్రమంగా వాటిని పెంచుకుంటూ ఒకానొక దశలో 78,553.45 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 504.86 పాయింట్ల లాభంతో 78,493.54 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 156.80 పాయింట్లు పెరిగి 24,353.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 943.29 పాయింట్లు, నిఫ్టీ 302.95 పాయింట్లు పెరిగింది.

ఆరు కంపెనీల షేర్లు డీలా..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో ఆరు మినహా మిగతావన్నీ లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా హిందుస్థాన్ యునిలీవర్ 4.75% పెరిగింది. పవర్‌గ్రిడ్ 1.86%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.61%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.56%, అదానీ పోర్ట్స్ 1.53%, టైటన్ 1.46% మేర లాభపడ్డాయి. మరోవైపు సన్‌ఫార్మా 1.06%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.68%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.57%, ఎల్అండ్‌టీ 0.54% చొప్పున నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీలన్నీ రాణించాయి.

జనవరి మార్చి త్రైమాసికంలో నికర లాభం తగ్గడం, ఆదాయ అంచనాలూ స్తబ్దుగా ఉండటంతో విప్రో షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యాయి. బీఎస్ఈలో 2.78 శాతం నష్టపోయి రూ.204.35 వద్ద ముగిశాయి.

ఓం పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన రోజే అదరగొట్టాయి. ఇష్యూ ధర రూ.175తో పోలిస్తే 3.48% అధికంగా రూ.181.10 వద్ద బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు నమోదయ్యాయి. చివరకు 8.65% లాభంతో రూ.190.15 వద్ద ముగిశాయి. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.651.17 కోట్లుగా నమోదైంది.

## రూ.2.03 లక్షల కోట్లకు భారత డిజిటల్ ప్రకటనల మార్కెట్

దిల్లీ: భారత డిజిటల్ ప్రకటనల మార్కెట్ రాబోయే అయిదేళ్ల కాలంలో రూ.2.03 లక్షల కోట్లకు (22 బి.డాలర్లు) చేరుకుంటుందని మార్కెట్ పరిశోధన సంస్థ రెడ్‌సీర్ అంచనా వేసింది. 2025 నాటికి సుమారు రూ.1.01 లక్షల కోట్లుగా ఉన్న భారత డిజిటల్ యాడ్ మార్కెట్, ఏటా 1015 శాతం వృద్ధితో చెందుతోందని పేర్కొంది. సాధారణ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కంటే డిజిటల్ ప్రకటనల వ్యయం అత్యంత వేగంగా పెరుగుతోందని నివేదిక వెల్లడించింది. 2025లో మొత్తం అంతర్జాతీయ ప్రకటనల వ్యయంలో డిజిటల్ రంగం వాటా 7075% ఉందని తెలిపింది. ఇది ప్రపంచ జీడీపీ వృద్ధి రేటుకంటే 35 రెట్లు అధిక వేగంతో వృద్ధి చెందుతోందని పేర్కొంది.

2025లో ప్రపంచ డిజిటల్ ప్రకటనల వ్యయంలో 46% వాటాతో అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతోంది. 24 శాతంతో చైనా రెండో స్థానంలో ఉంది. ఇందులో భారత వాటా ప్రస్తుతం సుమారు 1 శాతంగా మాత్రమే ఉందని నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచ డిజిటల్ ప్రకటనల మార్కెట్ 2030 నాటికి 1.2 ట్రిలియన్ డాలర్లను (సుమారు రూ.111 లక్షల కోట్లు) దాటనుందని అంచనా వేసింది.




## మళ్లీ 700 బి.డాలర్ల ఎగువకు విదేశీ మారకపు నిల్వలు



: భారత విదేశీ మారకపు నిల్వలు మళ్లీ 700 బిలియన్ డాలర్ల(సుమారు రూ.63 లక్షల కోట్లు) ఎగువకు వెళ్లాయి. ఏప్రిల్ 10తో ముగిసిన వారంలో 3.825 బిలియన్ డాలర్లు పెరిగి 700.946 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు ఏప్రిల్ 3తో ముగిసిన వారంలోనూ 9.063 బిలియన్ డాలర్లు పెరిగి 697.121 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఏప్రిల్ 10తో ముగిసిన వారంలో విదేశీ మారకపు నిల్వల్లో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 3.127 బిలియన్ డాలర్లు అధికమై 555.983 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వల విలువ కూడా 601 మిలియన్ డాలర్లు పెరిగి 121.343 బి.డాలర్లుగా నమోదైంది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ కూడా 56 మిలియన్ డాలర్లు పెరిగి 18.763 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత నిల్వల స్థితి 41 మిలియన్ డాలర్లు అధికమై 4.857 బి.డాలర్లుగా నమోదైంది.

ఏడు రోజుల వేరియబుల్ రేట్ రివర్స్ రెపో వేలం ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో నుంచి రూ.2,00,031 కోట్ల నిధులను ఆర్‌బీఐ ఉపసంహరించింది.

## బంగారం, వెండి దిగుమతుల కోసం

### 15 బ్యాంకులకు కేంద్రం అనుమతి

ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ వంటి 15 బ్యాంకులకు బంగారం, వెండి దిగుమతులు చేసుకోవడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు మూడేళ్ల పాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయి. యూనియన్ బ్యాంక్, స్బెర్ బ్యాంకులకు కేవలం బంగారం మాత్రమే దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది.

**బ్యాంకుల జాబితా**

యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, డాయిష్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యెస్ బ్యాంక్ లిమిటెడ్ ఈ జాబితాలో ఉన్నాయి.

అంతకుముందు భారతీయ బ్యాంకులు బంగారం, వెండి దిగుమతులను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. బులియన్ దిగుమతులకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో టన్నుల కొద్దీ లోహాలకు కస్టమ్స్ క్లియరెన్స్ లభించలేదని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2025 ఏప్రిల్‌లో చివరగా ప్రభుత్వం ఈ దిగుమతులకు అధికారిక అనుమతులు ఇవ్వగా.. మార్చి 31తో వీటికి గడువు పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల కోసం బ్యాంకులు ఎదురుచూస్తున్న వేళ మూడేళ్ల పాటు దిగుమతులకు అనుమతిస్తూ కేంద్రం నుంచి నోటిఫికేషన్ రావడం గమనార్హం.



## నాన్నే నా రియల్ హీరో



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరో అంతర్జాతీయ గుర్తింపును తన ఖాతాలో వేసుకున్నారు. తాజాగా ఆయన ప్రతిష్ఠాత్మక 'ఈ స్క్వేర్ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన తండ్రి, మెగాస్టార్ చిరంజీవి గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "నా జీవితంలో నిజమైన హీరో నాన్నే" అని గర్వంగా చెబుతూ, ఆయన వ్యక్తిగత, వృత్తిగత జీవితం తనపై చూపిన ప్రభావాన్ని వివరించారు.నాన్న వారసత్వం తమకు సులభంగానే అందినా, ఆయన పడిన కష్టం మాత్రం అపారమని చరణ్ పేర్కొన్నారు. సినిమాల కోసం చిరంజీవి ఎంతగా కష్టపడతారో వివరిస్తూ, "కొన్నిసార్లు షూటింగ్‌ల సమయంలో రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోయిన సందర్భాలు ఉన్నాయి. వృత్తి పట్ల ఆయనకున్న అంకితభావం అలాంటిది" అని గుర్తు చేసుకున్నారు. అంతటి బిజీ షెడ్యూల్‌లో కూడా చిరంజీవి కుటుంబానికి సమయం కేటాయించడంలో ఎప్పుడూ రాజీ పడలేదని రామ్ చరణ్ వెల్లడించారు. మూడు రోజులు విరామం దొరికినా వెంటనే కుటుంబంతో గడపడానికే ఆయన ప్రాధాన్యత ఇచ్చేవారని, ఆయన క్రమశిక్షణ తనకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. ఎంతటి స్టార్‌డమ్ ఉన్నప్పటికీ, ఇంట్లో మాత్రం చిరంజీవి ఒక సాధారణ తండ్రిలాగే ఉంటారని కొనియాడారు. పరిశ్రమలో కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని చెప్పారు. జీవితంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగే చిరంజీవి తత్వం తనపై ఎంతో ప్రభావం చూపిందని, తాను కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నానని పేర్కొన్నారు. వృత్తిపరమైన బాధ్యతలు, కుటుంబ బంధాలను సమన్వయం చేసుకోవడం ఎలాగో తన తండ్రిని చూసే నేర్చుకున్నానని రామ్ చరణ్ వివరించారు.ఇక కెరీర్ విషయానికొస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సనా దర్శకత్వంలో 'పెద్ది' అనే చిత్రంలో నటిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి కావొచ్చింది. ప్రేక్షకులకు మరింత మెరుగైన థియేట్రికల్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని ఏప్రిల్ నుంచి జూన్‌కు వాయిదా వేసినట్లు ఇటీవల మేకర్స్ ప్రకటించారు.



## కోలీవుడ్‌కు మరో షాక్.. 'జైలర్ 2' సీన్స్ లీక్!

కొన్ని రోజుల క్రితం 'జన నాయగన్' (Jana Nayagan) సన్నివేశాలు ఆన్‌లైన్‌లో లీక్ అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో స్టార్‌హీరో మూవీ సీన్స్ లీక్ కావడంతో కోలీవుడ్‌లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. రజనీకాంత్ (Rajinikanth) హీరోగా తెరకెక్కుతున్న 'జైలర్ 2' (Jailer 2) షూటింగ్ దశలోనే లీక్ అయినట్లు సమాచారం. ఈ మూవీలోని కీలక సన్నివేశం షూటింగ్‌కు సంబంధించిన ఫుటేజీ బయటకు వచ్చినట్లు తెలిసింది. దీనిపై స్పందించిన నిర్మాణసంస్థ సన్ పిక్చర్స్.. తమ యాంటీ పైరసీ రంగంలోకి దిగిందని కోలీవుడ్ మీడియా పేర్కొంది. హిట్ మూవీ 'జైలర్'కు సీక్వెల్‌గా 'జైలర్ 2'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్.

## తస్సాదియ్యా.. తగ్గేదే లేదు హొయ్యా

'మా ఇంటి బంగారం' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది నటి సమంత. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని నందినీ రెడ్డి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఇది వచ్చే నెల 15న విడుదల కానున్న నేపథ్యంలో గురువారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "తస్సాదియ్యా.. తగ్గేదే లేదు హొయ్యా.. అమ్మాయి అన్నాక ఆ మాత్రం ఉండాలే" అంటూ సాగిన ఈ పెళ్లి పాటకు సంతోష్ నారాయణన్ స్వరాలు సమకూర్చగా.. రెహమాన్ సాహిత్యమందించారు. చిన్మయి శ్రీపాద, పుణ్య సెల్వ ఆలపించారు. ఈ పాటలో సమంత కనిపించిన తీరు.. వేసిన హుషారైన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. "ఇది చిన్న.. పెద్ద తేడా లేకుండా కుటుంబమంతా కలిసి చూసే చిత్రంగా ముస్తాబైంద"ని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాని ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలిసి నిర్మించారు.



## బాలయ్యతో ఒకే హెలికాప్టర్‌లో డింపుల్ హయతి




నందమూరి బాలకృష్ణ తనదైన శైలిలో గుంటూరులో సందడి చేశారు. నిన్న లక్ష్మీపురంలో ఒక ప్రముఖ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి యువ నటి డింపుల్ హయాతితో కలిసి ఆయన విచ్చేశారు. వీరిద్దరూ హైదరాబాద్ నుంచి గుంటూరుకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ఈ క్రమంలో డింపుల్ సెల్ఫీ వీడియో తీస్తుండగా, బాలయ్య ఎంతో సరదాగా క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ అల్లరి చేశారు.


ప్రస్తుతం వీరిద్దరూ కలిసి ఒకే ఈవెంట్‌లో కనిపించడంతో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వస్తున్న 'NBK 111' చిత్రంలో డింపుల్ నటిస్తోందన్న వార్తలకు మరింత బలం చేకూరింది. ఇందులో ఆమె రెండో హీరోయిన్‌గా నటిస్తోందని ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

## హక్కుల రక్షణలో పుష్పరాజ్: ఢిల్లీ హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్

మా రంగంలో తనదైన బ్రాండ్ సృష్టించుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ఇప్పుడు తన వ్యక్తిగత హక్కుల పరిరక్షణ కోసం న్యాయక్షేత్రంలో అడుగుపెట్టారు. తన అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు, చివరకు తన వాయిస్‌ను కూడా వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోకుండా చూడాలని కోరుతూ ఆయన ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ముప్పు పొంచి ఉన్న ఈ కాలంలో సెలబ్రిటీల వాయిస్, ముఖచిత్రాలను మార్ఫింగ్ చేసి ప్రకటనలకు వాడుకుంటున్న తీరుపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ తుషార్ రావు గెడెల ధర్మాసనం ఇవాళ ఈ సివిల్ సూట్‌ను విచారించనుంది. గతంలో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ వంటి దిగ్గజాలు పొందిన రక్షణనే ఇప్పుడు అల్లు అర్జున్ కూడా కోరుతున్నారు. తన ప్రమేయం లేని వ్యాపారాల్లో తన పేరు వాడటం వల్ల బ్రాండ్ విలువ దెబ్బతింటుందన్నది ఆయన ప్రధాన వాదన.



## తప్పు ట్రైన్ ఎక్కితే దిగిపోవడమే మంచిది.. విడాకులపై స్పందించిన హన్సిక!



తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు.

జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## 'సుయోధన' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!



ప్రియదర్శి కథానాయకుడిగా విభిన్నమైన కథలను .. పాత్రలను ఎంచుకుంటూ వెళుతున్నాడు. అలా ఆయన చేసిన సినిమానే 'సుయోధన'. సాయికుమార్ .. ప్రేమ కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, వైఎస్ మాధవరెడ్డి దర్శకత్వం వహించాడు. మార్చి 27వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు నుంచే ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. వరుణ్ (ప్రియదర్శి) హైదరాబాదులో సినిమాలకి సౌండ్ ఎఫెక్ట్స్ క్రియేట్ చేస్తుంటాడు. అతనికంటూ ఒక సొంత స్టూడియో ఉంటుంది. చిన్నప్పటి నుంచి వరుణ్ ని ఒక సమస్య వేధిస్తుంటుంది. 'సుయోధన' అంటూ ఎవరో తనని పిలుస్తున్నట్టుగా అతనికి ఒక వాయిస్ వినిపిస్తూ ఉంటుంది. అలా ఎందుకు జరుగుతుందనేది తెలుసుకోవడానికి తనవంతు ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. వరుణ్ తండ్రి ప్రకాశ్ (సాయికుమార్) రాజకీయనాయకుడిగా బిజీగా ఉంటాడు. భార్య రాధ (రాజశ్రీ నాయర్) అతనికి రాజకీయాలలో సూచనలు .. సలహాలు ఇస్తుంటుంది. ఒక రోజున వరుణ్ కి 'సంహిత' తారసపడుతుంది. డెమో ఫిల్మ్ చేయాలనుకున్న సంహిత, అతని హెల్ప్ కోరుతుంది. అప్పటి నుంచి వాళ్ల పరిచయం ప్రేమగా మారుతుంది. చాలా కాలం క్రితం 'వరలక్ష్మి' అనే ఒక నర్స్, మహతి అనే ఒక యువతిని గురించి రాసుకున్న 'డైరీ' ఆధారంగా తాను డెమో ఫిల్మ్ షూట్ చేస్తున్నట్టు వరుణ్ తో సంహిత చెబుతుంది. మహతి (ప్రేమ) అనే ఒక యువతి తన భర్త చేతిలో మరణిస్తూ, చివరి నిమిషంలో తన బిడ్డను కాపాడుతుంది. ఆమె త్యాగం వరుణ్ మనసును కదిలించివేస్తుంది. మహతి ఎవరు? భర్త చేతిలో ఆమె ఎందుకు చనిపోయింది? అనే విషయాలు తెలుసుకోవాలని అతను నిర్ణయించుకుంటాడు. అందుకోసం రంగంలోకి దిగిన వరుణ్ పై, కొంతమంది ఆగంతకులు ఎటాక్ చేస్తారు. మహతి ఎవరు? ఆమె కథతో వరుణ్ కి గల సంబంధం ఏమిటి? అతనిపై దాడి చేయించింది ఎవరు? అతనికి తెలిసే చేదు నిజాలేమిటి? అనేది మిగతా కథ.జీవితంలో కొన్ని అంశాలు ఆసక్తికరంగా .. మనసును కదిలించేలా అనిపిస్తాయి. అలాంటి సంఘటనలను గురించిన నిజానిజాలు తెలుసుకోవాలనే కుతూహలం కూడా కలుగుతూ ఉంటుంది. ఆ దిశగా అడుగులు వేయడం మొదలుపెట్టినప్పుడు తెలిసే నిజాలు నివ్వెరపోయేలా చేస్తుంటాయి. అలాంటి ఒక పరిస్థితి ఈ సినిమాలో హీరోకి ఎదురైతే, అప్పుడతను ఏం చేశాడనే అంశం చుట్టూ ఈ కథ అల్లుకున్నారు. ఒక వైపు నుంచి సిన్సియర్ గా హీరో అన్వేషణ సాగుతూ ఉంటుంది. మరో వైపు నుంచి అతని మార్గానికి అవరోధాలు ఎదురవుతూ ఉంటాయి. రాజకీయాలు .. రౌడీ గ్యాంగులు .. పోలీస్ అధికారులు అతని ట్రాక్ ను టచ్ చేస్తూ ఉంటారు. అడపాదడపా డాక్టర్ల హడావిడి కూడా ఉండనే ఉంటుంది. హీరో వాటన్నింటినీ దాటుకుంటూ వెళుతున్న తీరును ఉత్కంఠ భరితంగా ఆవిష్కరించడానికి దర్శకుడు తనవంతు ప్రయత్నం చేశాడు. 'సుయోధన' అనే టైటిల్ వినగానే, ఇందులో సుయోధనుడిగా సాయికుమార్ ఏకపాత్రాభినయం .. భారీ డైలాగులు ఉంటాయని ప్రేక్షకులు అనుకోవడం సహజం. సరిగ్గా అలాంటి ఒక స్టేజ్ షోతోనే ఈ సినిమాను మొదలుపెట్టారు. సుయోధనుడి పాత్రతో ఈ కథకి సంబంధం ఉండటం వలన, ఆ టైటిల్ ను సెట్ చేసినట్టుగా మనకి అర్థమైపోతుంది. అర్థమయ్యేలా చెప్పారు కూడా. ఈ కథలో సస్పెన్స్ .. యాక్షన్ .. ఎమోషన్ .. ట్విస్టులు పలకరిస్తూ వెళుతుంటాయి. లవ్ ట్రాక్ కూడా ఉంది. కానీ ఎందుకనో దర్శకుడు ఆ వైపు పెద్దగా దృష్టి పెట్టలేదు. అందువలన హీరోయిన్ ఉందా అంటే ఉంది అంతే అనేట్టుగానే అప్పుడప్పుడు మాత్రమే తెరపై కనిపించడం జరుగుతుంది. ఇక ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ లో నాటకీయ పరిణామాలు మామూలే. ఈ కథలో హీరో తనకి కావలసిన సమాచారం కోసం పట్టువదలని విక్రమార్కుడి మాదిరిగా ముందుకు వెళుతుంటాడు. అయితే ముందు జరగబోయే కథను అప్పటికే గెస్ చేసిన ప్రేక్షకులు, అచ్చు అలాగే జరుగుతూ ఉండటంతో తాపీగా అలా కూర్చుండిపోయి చూస్తుంటారు అంతే. అసలు ఏం జరిగి ఉంటుందనేది తెరపై హీరోకంటే ముందుగానే ఆడియన్స్ పసిగట్టగలిగేలా ఉండటమే ఈ కథాకథనాలలోని ప్రధానమైన లోపంగా కనిపిస్తుంది. ప్రియదర్శి తన మార్క్ నటన కనబరిచాడు. హీరోయిన్ గురించి చెప్పుకోవడానికి ఏమీ లేదు. సాయికుమార్ .. ప్రేమ .. రాజశ్రీ నాయర్ .. దేవీప్రసాద్ .. ఇలా మంచి సీనియర్ ఆర్టిస్టులే ఉన్నారు. ఎవరికి వారు పాత్ర పరిధిలో మెప్పిస్తూనే వెళ్లారు. కార్తీక్ కొప్పర ఫొటోగ్రఫీ .. జయ్ క్రిష్ నేపథ్య సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తాయి. ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ ఓకే.



# సామాన్యులకు దూరంగా ఐపీఎల్

క్రికెట్‌పై తెలుగు ప్రజలకు ఉండే అభిమానాన్ని తమిళనాడుకు చెందిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) యాజమాన్యం బాగా సొమ్ము చేసుకుంటోంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి తొలి రెండు మ్యాచ్‌లకు కొన్ని ఎంపిక చేసిన స్టాండ్స్‌లో రేట్లు పెంచిన ఎస్‌ఆర్‌హెచ్.. శనివారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌కు వివిధ స్టాండ్స్‌లోని టిక్కెట్ల రేట్లను రెట్టింపు చేసింది. దీంతో సగటు క్రికెట్ అభిమాని టిక్కెట్ కొనుగోలు చేసి, మ్యాచ్‌ను చూడలేని స్థితికి ఐపీఎల్ చేరుకుందని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సౌత్ ఈస్ట్, వెస్ట్ టెర్రస్ టిక్కెట్లను రూ.1250 నుంచి రూ.2500కు పెంచేశారు. అలాగే రూ.2,250 ఉండే ఈస్ట్, వెస్ట్ ఫస్ట్ ఫ్లోర్ టిక్కెట్ ధరలను రూ.3500లకు, రూ.23 వేలుగా ఉన్న సౌత్ కార్పొరేట్ బాక్సు టిక్కెట్లను ఏకంగా రూ.33 వేలకు పెంచేశారు. వీటికి బుకింగ్ చార్జీలు రూ.300ల నుంచి రూ.2 వేల వరకు టిక్కెట్ శ్రేణిని బట్టి అదనం. సరే ఇవన్నీ పక్కకి పెట్టి ఏదో రకంగా ధోనీని చూడాలనో, మరో అభిమాన క్రికెటర్ ఆటని ప్రత్యక్షంగా తిలకించాలనో టిక్కెట్లు కొనుగోలు చేసేందుకు యాప్ ఓపెన్ చేస్తే భారీ క్యూ లైన్ చూపించి, క్షణాల్లో టిక్కెట్లు అయిపోయాయని సోల్డ్ అవుట్ మెసేజ్‌లు దర్శనమిస్తున్నాయి. చెన్నై సూపర్ కింగ్స్‌తో పాటు ఇతర జట్లన్నీ టిక్కెట్ల ధరలను తెలియజేస్తూ మ్యాచ్‌కు ముందు ఇచ్చే సమాచారం కూడా ఎస్‌ఆర్‌హెచ్ అందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కాంప్లిమెంటరీ పాస్ లు మినహాయించి, మిగిలిన టిక్కెట్లను యాప్‌లో అందుబాటులో ఉంచకుండా ఎస్‌ఆర్‌హెచ్ బ్లాక్ చేసి, సిఫార్సుల ఆధారంగా అమ్ముతున్నదని అభిమానులు మండిపడుతున్నారు. ఎస్‌ఆర్‌హెచ్‌కు చిత్తశుద్ధి ఉంటే విక్రయించిన టిక్కెట్ల సమాచారాన్ని బహిరంగంగా వెల్లడించాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు.

# కోల్‌కతాపై గుజరాత్ విజయం

**రెండు ఓటములతో ఈ ఐపీఎల్‌ను ఆరంభించిన గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం నిలకడగా దూసుకెళ్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (50 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 86) కళాత్మక బ్యాటింగ్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 5 వికెట్ల తేడాతో నెగ్గిం ది. జీటీకిది హ్యాట్రిక్ విజయం కాగా.. అటు కేకేఆర్ ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఒకటి వర్షంతో రద్దుకాగా, మిగిలిన ఐదింటిలోనూ ఓడింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందు గా కోల్‌కతా 20 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్ (55 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 79), పోవెల్ (20 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 27) మాత్రమే రాణించారు. రబాడకు మూడు.. సిరాజ్, అశోక్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 181 పరుగులు చేసింది. బట్లర్ (25), సుదర్శన్ (22) రాణించారు. వరుణ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు.**

శుభ్‌మన్ పోరాటం: ఓ మాదిరి ఛేదనను గుజరాత్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. అయినా కేకేఆర్ బౌలర్లు మధ్య ఓవర్లలో కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. మ్యాచ్‌ను కాపాడుకునేందుకు చివరి ఓవర్ వరకు పోరాడినా టైటాన్స్‌దే పైచేయి అయ్యింది. ఓపెనర్లు గిల్, సుదర్శన్ ఆరంభం నుంచే ఎదురు దాడికి దిగడంతో తొలి మూడు ఓవర్లలోనే స్కోరు 40కి చేరింది. ఆరో ఓవర్‌లో సుదర్శన్ వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అదే ఓవర్‌లో బట్లర్ 4,6,4తో పవర్‌ప్లేలో టైటాన్స్ 71/1 స్కోరుతో పటిష్ఠంగా నిలిచింది. కానీ మధ్య ఓవర్లలో కేకేఆర్ బౌలర్లు గుజరాత్‌ను కట్టుదిట్టం చేశారు. 27 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. అటు బట్లర్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేశాడు. సుందర్ (13) కూడా విఫలమయ్యాడు. అయితే 17వ ఓవర్‌లో గ్రీన్ డైవింగ్ క్యాచ్‌తో గిల్ పోరాటం ముగిసింది. అప్పటికి సమీకరణం 18 బంతుల్లో 23 పరుగులకు చేరింది. చివరి ఓవర్లో ఆరు పరుగులు చేయాల్సి వచ్చింది. ఫిలిప్స్ (19)ను పేసర్ రమణ్‌దీప్ అవుట్ చేసినా మరో 2 బంతులుండగానే టైటాన్స్ మ్యాచ్‌ను ముగించింది.

### గ్రీన్ ఒక్కడే..:

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా ఇన్నింగ్స్‌లో ఎట్టకేలకు గ్రీన్ బ్యాట్ ఝుళిపించినా, అతడికి మరో ఎండ్‌లో సహకారం కరువైంది. దీనికి తోడు ఆఖర్లో గుజరాత్ బౌలర్లు 33 పరుగులే ఇచ్చి చివరి 6 వికెట్లు పడగొట్టారు. దీంతో కేకేఆర్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ రహానె తొలి ఓవర్‌లోనే గోల్డెన్ డకౌట్ కాగా, రెండో ఓవర్‌లోనే రఘువంశీ (8) కూడా వెనుదిరిగాడు. ఇక అలెన్ స్థానంలో బరిలోకి దిగిన మరో ఓపెనర్ సైఫర్ట్ (19) నాలుగో ఓవర్‌లో రబాడకు చిక్కాడు. తద్వారా పవర్‌ప్లేను కేకేఆర్ 32/3 స్కోరుతో పేలవంగా ముగించింది. ఈ దశలో గ్రీన్‌పోవెల్ అడపాదడపా బౌండరీలతో నాలుగో వికెట్‌కు 55 రన్స్ జోడించారు. 11వ ఓవర్‌లో పోవెల్ నిష్క్రమించాక గ్రీన్ జోరు పెంచాడు. 12వ ఓవర్‌లో స్పిన్నర్ రషీద్‌ను లక్ష్యంగా చేసుకుని 4,6,4తో 16 రన్స్ సాధించగా.. పేసర్ అశోక్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అదే ఊపుతో రషీద్ తర్వాతి ఓవర్‌లోనూ 6,4,6తో గ్రీన్ దూకుడు సాగించాడు. అయితే ఇదే ఓవర్‌లో అతడు స్టంప్, క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్నాడు.

కానీ 15వ ఓవర్ నుంచి టైటాన్స్ పేసర్లు పట్టు సాధించడంతో కేకేఆర్ ఆట లయ తప్పింది. వరుస ఓవర్లలో అనుకుల్ (9), రింకూ (1), రమణ్‌దీప్ (17), నరైన్ (0), కార్తీక్ త్యాగి (6) పెవిలియన్‌కు చేరడంతో గ్రీన్ క్రీజులో ఉన్నా లాభం లేకపోయింది. ఇక చివరి ఓవర్‌లో రషీద్ ఆరు పరుగులే ఇచ్చి గ్రీన్ వికెట్‌ను కూడా తీయడంతో కేకేఆర్ ఇన్నింగ్స్ ముగిసింది.





### స్కోరు వివరాలు

**కోకోల్‌కతా: సైఫర్ట్ (సి) ఫిలిప్స్ (బి) రబాడ 19, రహానె (సి) రబాడ (బి) సిరాజ్ 0, రఘువంశీ (సి) బట్లర్ (బి) రబాడ 8, గ్రీన్ (సి) బట్లర్ (బి) రషీద్ 79, పోవెల్ (సి) సిరాజ్ (బి) అశోక్ 27, అనుకుల్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 9, రింకూ (సి) బట్లర్ (బి) రబాడ 1, రమణ్‌దీప్ (సి) సిరాజ్ (బి) అశోక్ 17, నరైన్ (సి) ఫిలిప్స్ (బి) సిరాజ్ 0, త్యాగి (రనౌట్) 6, అరోరా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 180 ఆలౌట్; వికెట్ల పతనం: 1-5, 2-21, 3-32, 4-87, 5-147, 6-148, 7-165, 8-166, 9-173, 10-180; బౌలింగ్: సిరాజ్ 4-0-23-2, రబాడ 4-0-29-3, ప్రసిద్ధ్ 4-0-32-1, అశోక్ 4-0-45-2, రషీద్ 4-0-44-1.**

**గుజరాత్: సుదర్శన్ (సి) త్యాగి (బి) నరైన్ 22, గిల్ (సి) గ్రీన్ (బి) వైభవ్ 86, బట్లర్ (సి) గ్రీన్ (బి) వరుణ్ 25, వాషింగ్టన్ (సి) త్యాగి (బి) వరుణ్ 13, ఫిలిప్స్ (సి) రింకూ (బి) రమణ్‌దీప్ 19, తెవాటియా (నాటౌట్) 7, షారుక్ (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19.4 ఓవర్లలో 181/5; వికెట్ల పతనం: 1-57, 2-95, 3-141, 4-158, 5-177; బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-35-1, కార్తీక్ త్యాగి 4-0-40-0, అనుకుల్ 3-0-37-0, నరైన్ 4-0-28-1, వరుణ్ చక్రవర్తి 4-0-34-2, రమణ్‌దీప్ 0.4-0-5-1.**

**బెంగళూరు X ఢిల్లీ**
**మ.3.30 (బెంగళూరు)**
**సన్‌రైజర్స్ X చెన్నై**
**రా.7.30 (హైదరాబాద్)**

# యువరాజ్ సింగ్ మరో శిష్యుడు.. ఓపెనింగ్‌లో దుమ్మురేపుడే!



మొన్నటి వరకూ అభిషేక్ శర్మ.. అబ్బో అదరగొట్టేశాడు. ఇరగదీశాడురోయ్ అంటూ ఒకటే చర్చ.. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ తెరపైకి వచ్చాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు భలేగా ఆడేస్తున్నాడోయ్ అంటూ ప్రశంసలు..

ఇక యశస్వి జైస్వాల్, ఆయుష్ మాత్రే, ప్రియాంశ్ ఆర్య ఏమైనా తక్కువా? అంటే అదేం కాదు. అదరగొట్టే ఆటను చూస్తూనే ఉన్నాం.. కానీ, మరొక ప్లేయర్ కూడా ఈ జాబితాలో చేరతాడు. అతడి దూకుడు వీరికేం తీసిపోదన్నట్టుగా ఉంటుంది మరి..

ఎక్కువగా ఈ పేర్లు మాత్రమే హైలైట్‌గా నిలిచేవి. వారి ఆటతీరు కూడా ఆ స్థాయిలో ఉండేది. కానీ, మరో ప్లేయర్ కూడా ఉన్నాడండోయ్.. అతడూ అత్యంత డేంజరస్ బ్యాటరే. తొలి బంతి నుంచే ఎటాకింగ్ గేమ్ ఆడేయడం అతడి స్పెషాలిటీ. మిగతా కుర్రాళ్ల మాదిరిగా అప్పుడప్పుడు కాదు.. దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా విరుచుకుపడిన అతడే పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్. ఈ పేరు ఇప్పటికే మీరు వినే ఉంటారు. చాపకింద నీరులా తన పని తాను చేసుకుంటూపోయే స్వభావం కలిగిన ప్లేయర్. అన్నట్టు ఇతడూ స్టార్ మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ శిష్యుడే. అభిషేక్ మాదిరిగా యువీ దగ్గర క్రికెట్ పాఠాలు నేర్చుకుని రాటుదేలిన ఆటగాడే.పంజాబ్ కింగ్స్ గత ఐపీఎల్ సీజన్ ఫైనల్‌కు చేరుకోవడంలో ఆ జట్టు ఓపెనర్లదే కీలక పాత్ర. ప్రస్తుత ఎడిషన్‌లోనూ ఆ జోరు తగ్గలేదు. ఐదు మ్యాచుల్లో నాలుగింట్లో గెలిచి పాయింట్ల పట్టికలో (9) అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఈ నాలుగు మ్యాచుల్లోనూ ప్రభ్ సిమ్రన్ బ్యాటింగ్‌ను చూస్తే మతిపోవాల్సిందే. మరీ ముఖ్యంగా ముంబయిపై కేవలం 39 బంతుల్లో 80 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. బౌల్ట్, బుమ్రా, హార్దిక్ వంటి పేస్ ఎటాక్‌కు ఎదురొడ్డి మరీ పరుగులు రాబట్టాడు గమనార్హం. అంతకుముందు సన్‌రైజర్స్‌పైనా 25 బంతుల్లో 51 పరుగులు చేశాడు. ప్రస్తుతం అత్యధిక పరుగుల జాబితాలో ప్రభ్ సిమ్రన్ (211) ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు.

నిలకడకు మారుపేరుగా..

గత సీజన్‌లోనూ ప్రభ్ సిమ్రన్ బ్యాట్ నుంచి నాణ్యమైన ఇన్నింగ్స్‌లు వచ్చాయి. ఫైనల్ చేరిన పంజాబ్ జట్టులో రెండో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ ప్రభ్. 17 మ్యాచుల్లో 549 పరుగులు చేసిన అతడి స్ట్రైక్‌రేట్ 160.52. పవర్ ప్లేలో దూకుడుగా ఆడి పరుగులు చేసే ప్రభ్ ఈసారి ఇంకాస్త నిలకడైన ఆటతీరు ప్రదర్శిస్తుండటం గమనార్హం. అదీనూ తన స్ట్రైక్‌రేట్‌ను పడనీయకుండా చూసుకుంటూ పరుగులు రాబట్టాడు. మ్యాచ్‌ను ముగించే వరకూ క్రీజ్‌లో ఉండేందుకు ప్రయత్నించడం పరిణతికి నిదర్శనమని పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నుంచి ప్రశంసలు అందుకొన్నాడు. అందుకు ఉదాహరణ ముంబయితో మ్యాచ్‌ను తీసుకుంటే.. ఈ ఇన్నింగ్స్‌లో కేవలం రెండు సిక్స్‌లను మాత్రమే కొట్టాడు. అయినా సరే, 200+ స్ట్రైక్‌రేట్‌ను కొనసాగించడం గమనార్హం. వైభవ్, అభిషేక్, యశస్వి.. వీరైనా కొన్ని మ్యాచుల్లో ఇబ్బంది పడ్డారేమో కానీ ప్రభ్ సిమ్రన్ మాత్రం దూకుడుగానే ఆడాడు. పవర్‌ప్లేలోనే కాదు.. మిడిల్ ఓవర్లలోనూ ప్రభ్ స్ట్రైక్‌రేట్ అమోఘం. నికోలస్ పూరన్, రజత్ పాటీదార్, శ్రేయస్ అయ్యర్ తర్వాత మంచి స్ట్రైక్‌రేట్ ఉంది. దాదాపు ప్రతి 6.54 బాల్స్‌కు ఫోర్ రాబట్టాడు. కేవలం సిక్స్‌లను మాత్రమే కాకుండా.. ఖాళీల్లో బంతిని పంపించే టెక్నిక్ ఉన్న బ్యాటర్‌గా తన సత్తా చూపించాడు.

యువరాజ్‌తో..

డేంజరస్ ఓపెనర్ అభిషేక్ శర్మను తీర్చిదిద్దిన టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్‌కు ప్రభ్ సిమ్రన్ కూడా శిష్యుడే. యువీని తన పెద్దన్నగా చెబుతుంటాడు ప్రభ్ సిమ్రన్. ఏ సమయంలోనైనా ఫోన్ చేసి మాట్లాడేంత స్వేచ్ఛ ఉందని పలు ఇంటర్వ్యూల్లో ప్రభ్ వెల్లడించాడు. తమ ఇద్దరి మధ్య కోచ్‌స్టూడెంట్ అనుబంధం కాదని.. సోదరుడు కంటే ఎక్కువని పేర్కొన్నాడు. ఐపీఎల్‌లోకి 2019న అడుగు పెట్టిన ప్రభ్ సిమ్రన్‌కు ఆరేళ్ల తర్వాత బ్రేక్ వచ్చింది. గత సీజన్‌లో 500+ పరుగులు చేసి శభాష్ అనిపించుకున్నాడు. ఇప్పుడీ ఎడిషన్‌లోనూ అద్భుత ఆటతీరుతో తనను రిటెన్షన్ చేసుకోవడం సరైందిగా నిరూపించాడు.

**కుటుంబ నేపథ్యమిదీ..**

పంజాబ్‌లోని పటియాలాలో 2000లో జన్మించిన ప్రభ్ సిమ్రన్ కుటుంబం క్రీడలను బాగా ప్రోత్సహించేది. అయితే, అతడి తండ్రి సుర్జిత్ సింగ్‌కు కిడ్నీ సంబంధిత అనారోగ్య పరిస్థితులు ఉండేవి. వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయించాల్సి ఉంటుంది. ప్రభ్ తల్లి జస్బిర్ కౌర్ కుటుంబ వ్యవహారాలను చూసుకొనేవారు. ప్రభ్‌కు సోదరుడు వరుసయ్యే అన్మోల్ ప్రీత్ సింగ్ కూడా క్రికెటరే. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్‌కు ఆడాడు. అతడి సోదరీమణులు జాతీయ స్థాయిలో హ్యాండ్‌బాల్ ప్లేయర్లు. ఫ్యామిలీ కూడా క్రికెటర్ కావడానికి మద్దతుగా నిలిచిందని ప్రభ్ చెబుతుంటాడు.

# టీ20 ప్రపంచ కప్..

## ఆ మ్యాచ్‌పై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం కన్ను

టీ20 ప్రపంచ కప్ ముగిసి దాదాపు నెలన్నర రోజులు దాటింది. టీమ్‌ఇండియా విజేతగా నిలిచింది. ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై అద్భుత విజయంతో ఛాంపియన్‌గా అవతరించింది. అయితే, కివీస్ సూపర్ 8లోకి రావడమే కష్టమనే పరిస్థితి నుంచి ఫైనల్‌కు చేరింది. ఈ క్రమంలో గ్రూప్ స్టేజ్‌లో కెనడా కివీస్ మ్యాచ్‌పై ఇప్పుడు ఐసీసీ అవినీతి నిరోధక యూనిట్ దృష్టి పడింది. ఆ మ్యాచ్‌లో కెనడాపై ఘన విజయంతో కివీస్ సూపర్ 8లోకి అడుగు పెట్టింది. చెపాక్ వేదికగా జరిగిన ఆ పోరులో కెనడా క్రికెట్ బోర్డు ఫిక్సింగ్‌కు పాల్పడిందని ఆరోపిస్తూ ఇటీవల ఓ డాక్యుమెంటరీ పేర్కొంది. దానిపై ఐసీసీ విచారణ చేపడుతోందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. ''క్రికెట్ కెనడాకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ ఆధ్వర్యంలో రెండు ఇన్వెస్టిగేషన్స్ టీమ్‌లు విచారణను మొదలుపెట్టాయి'' అని ఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. కివీస్‌తో మ్యాచ్‌లో కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా వేసిన ఐదో ఓవర్ అనుమానాస్పదంగా మారిందని కెనడాకు చెందిన ఇన్వెస్టిగేటివ్ కార్యక్రమం 'ది ఫిఫ్త్ ఎస్టేట్' తెలిపింది. కేవలం టోర్నీకి మూడు వారాల ముందే బజ్వాను కెనడా సారథిగా బోర్డు నియమించింది. నాలుగు ఓవర్లలో 35/2 స్కోరుతో ఉన్న కివీస్.. బజ్వా వేసిన ఐదో ఓవర్‌లో 15 పరుగులు రాబట్టింది. అక్కడినుంచి మ్యాచ్ స్వరూపం మారిపోయిందనేది సదరు డాక్యుమెంటరీ ఆరోపణ. అయితే.. ఇలాంటివాటిపై తమ ఏసీయూ ఇప్పటికిప్పుడు స్పందించే స్థితిలో లేదని ఐసీసీ తాత్కాలిక జీఎం ఆండ్రూ ఎఫ్‌గ్రేవ్ తెలిపారు. విచారణ తర్వాతే అసలు విషయం తేలుతుందని వెల్లడించారు. ఇక జట్టు ఎంపికకు సంబంధించి మాజీ కెనడా కోచ్ ఖుర్రమ్ చోహాన్ పాత్ర పైనా విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఫలానా ఆటగాళ్లనే ఎంపిక చేయాలని బోర్డు మెంబర్లపై అతడు ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం.

తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 173/4 స్కోరు చేసింది. ఓపెనర్ యువరాజ్ సమ్రా (110) సెంచరీ కొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనలో 15.1 ఓవర్లలోనే 2 వికెట్లను కోల్పోయి టార్గెట్‌ను ఛేదించి న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది.




# హర్మన్‌సేన ఓటమి

**డర్బన్: దక్షిణాఫ్రికా పర్యటనను భారత మహిళల జట్టు ఓటమితో ప్రారంభించింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఆతిథ్య సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో హర్మన్‌ప్రీత్ సేనపై గెలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 157 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (47 నాటౌట్), జెమీమా రోడ్రిగ్స్ (36), షఫాలీ వర్మ (34) రాణించారు. స్మృతీ మంధాన (13) నిరాశపరిచింది. ఖాఖ మూడు, సెఖుఖునె రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో దక్షిణాఫ్రికా 19.1 ఓవర్లలో 158/4 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్, ఓపెనర్ లారా వోల్వార్ట్ (51) అర్ధ సెంచరీతో సత్తా చాటగా.. ఆఖర్లో డెర్క్‌సెన్ (44 నాటౌట్), ట్రయాన్ (18 నాటౌట్) అదరగొట్టారు. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్ 2 వికెట్లు తీసింది.**

